క్లుప్తంగా

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ పి.జగదీష్



పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఎన్నికల పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా చర్యలను ఎస్పీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. రౌడీ షీటర్లు, ఓల్డ్ ఎలక్షన్ అఫెండర్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా వారికి సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశామన్నారు.

బధిరులు అసమానులు

ప్రియదర్శినిలో ఎంపీ భరత్ పుట్టిన రోజు వేడుకలు



ప్రియదర్శిని ఆశ్రమంలో చిన్నారులతో ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: బధిరులు అసమానులని, వారు ఆలోచనలోను, అన్నింటిలోను మనకంటే ముందుంటారని రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో ఎంపీ భరత్‌రామ్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ కుటుంబ సమేతంగా బధిరులతో కలిసి భోజనం చేశారు. వారికి అవసరమైన పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు వంటి సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరీర వైకల్యం మాత్రమే బధిరులదని, వారు నేడు అన్ని రంగాల్లోను ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నో వ్యయ ప్రయాలకోర్చి 150 మందికి పైగా చిన్నారులను కంటికి రెప్పలా చూస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు స్వప్నవర్మ సేవలను అభినందించారు. ఆశ్రమానికి త్వరలో శాశ్వత భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు కె.ఆశాలత, ఎలిషా రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించిన ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్



స్వామివారిని దర్శించుకున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పెదపూడి: సార్వత్రిక ఎన్నికల్లో విజయం చేకూరాలని, భారీ మెజార్టీ సాధించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసు ఆదివారం పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. పుట్టకొండ గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక సర్పంచ్ వల్లు వెంకటరమణ, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యప్యాలస్	ప్రతినిధి–2
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ	లక్ష్మీకటాక్షం
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
మేనక	ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	రత్నం
నామవరం	
వివిఎస్.మహల్	కృష్ణమ్మ, ప్రతినిధి–2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కృష్ణమ్మ, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కడియం	
వెంకటసూర్య	ఆ ఒక్కటీ అడక్కు



పంపిణీకి సిద్ధం చేసిన ఈవీఎంలు, కంట్రోల్., బ్యాలెట్ యూనిట్లు



నగరంలో సిద్ధమైన ఓ పోలింగ్ కేంద్రం



పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులు

రంగం.. సిద్ధం..

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఓటింగ్‌కు 237 పోలింగ్ కేంద్రాలు
- ఓటు వేయనున్న 2,67,484 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది, ఎన్నికల సామగ్రి
- కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులకు పూర్తయిన ఏర్పాట్లు



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఆర్వో దినేష్‌కుమార్



పోలింగ్ మెటీరియల్ పంపిణీకి వచ్చిన సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రక్రియ కీలకదశకు చేరింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరిగే ఎన్నికల ఓటింగ్ పక్రియ స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం శ్రీకందుకూరి వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాధవీలత, ఆర్వో దినేష్‌కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గాన్ని 20 సెక్టార్లుగా విభజించి, 90 లొకేషన్లు ఏర్పాటు చేశారు. వీటిలో 237 పోలింగ్ కేంద్రాల్లో 2,67,484 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళలు 1,38,194, పురుషులు 1,28,287, ఇతరులు 57 మంది ఉన్నారు. పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు 1,530 మంది సిబ్బంది, 88 మంది మైక్రో అబ్జర్వర్లు, మూడు సర్వైవల్ బృందాలు, పోలీసు సిబ్బంది విధుల్లో భాగస్వాములు కానున్నారు. 237 పోలింగ్ కేంద్రాల్లో 79 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, ప్రత్యేక భద్రత, రక్షణ చర్యలు చేపట్టారు. ఓటింగ్ పక్రియను పరిశీలించేందుకు తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్లు, మూడు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ బృందాలు, మూడు వీడియో చిత్రీకరణ బృందాలు ఏర్పాటు చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన 20 సెక్టార్లకు 20 మంది సెక్టార్ అధికారులు, 20 మంది రూట్ ఆఫీసర్లు పోలింగ్ సామగ్రి తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ముగ్గురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా 237 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పీవోలు 259, ఏపీవోలు 259 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 1,012 మంది ఉన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 237 పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ తరలించే ప్రక్రియ పూర్తి చేశారు. ఈవీఎంలు 570, బ్యాలెట్ యూనిట్లు 310 తరలించారు. వీటితో పాటు అదనంగా ఈవీఎంలు 570 కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 310 సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే ఆయా రూట్ మ్యాప్‌కు అనుగుణంగా 90 లొకేషన్లకు పోలింగ్ మెటీరియల్ను, సిబ్బందిని తరలించారు. నగరంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. వీటి తో పాటు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ప్రాథమిక చికిత్స కేంద్రాలనూ ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



నగరంలో 237 పోలింగ్ కేంద్రాల్లో అన్ని విధాలా వసతులు కల్పించాం. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. మంచినీరు, వైద్య శిబిరాలు, లైటింగ్ సౌకర్యాలతో పాటు, పటిష్ట పోలీస్ భద్రత కల్పించాం. కేంద్ర పోలీస్ బలగాలూ ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తుగా సెక్షన్–144 అమలు చేస్తున్నాం. ఓటర్లు నూరు శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– దినేష్‌కుమార్, సిటీ ఎన్నికల ఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్

ఓటు వేద్దాం.. రండి..



ఈవీఎంలు, మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రాలకు బయలు దేరిన సిబ్బంది



ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం, ఆర్వో, జేసీ తేజ్‌భరత్



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 2,72,826 మంది ఓటర్లు
- 267 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- పోలింగ్ నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధం
- కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, ఎన్నికల నిర్వహణ అధికారులు
- బరిలో ఏడుగురు అభ్యర్థులు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల సమరం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో కీలక దశకు చేరకుంది. సోమవారం జరిగే పోలింగ్‌కు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా భారీ ఏర్పాట్లు చేసింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 2,72,826 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 267 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుండగా, 534 ఈవీఎంలను సిద్ధం చేయగా, అదనంగా 20 శాతం ఈవీఎంలు అందుబాటులో ఉంచినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ వెల్లడించారు. మొత్తం 2,72,826 మంది ఓటర్లలో 2,855 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కేంద్రాలకు ఈవీఎంలు, సిబ్బంది

బొమ్మూరులోని కలెక్టరేట్ ఆవరణలోని నేక్ హాస్టల్ భవనం వద్ద రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆధ్వర్యంలో ఆదివారం ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. 27 సెక్టార్లు విభజించి సెక్టార్ ఆఫీసర్ల నేతృత్వంలో పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు పార్లమెంటు, అసెంబ్లీ ఈవీఎంలను, పోలింగ్ సామగ్రిని తీసుకున్నారు. ఉదయం 11 గంటల నుంచే ఆయా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. మధ్యాహ్నం రెండు గంటలకు 27 రూట్లలో బస్సుల్లో ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది పూర్తిగా బయలుదేరారు. పోలీసు బందోబస్తుతో బస్సులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

నియోజకవర్గంలో 56 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కాగా సమస్మాత్మక కేంద్రాల పరిధిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు సాధారణ, ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. అనుమానితులపై నిఘా పెట్టడంతో పాటు, కేంద్ర పారా మిలటరీ బలగాలను రంగంలోకి దింపారు.

అధికారుల పర్యవేక్షణ

రూరల్ నియోజకవర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను రాష్ట్ర పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలపై అవగాహన కూడా కల్పించారు. ఇలాఉండగా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీఎస్పీ, కాంగ్రెస్, భారత చైతన్య యువజన పార్టీ, జైభారత్ నేషనల్ పార్టీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థి మొత్తం ఏడుగురు పోటీలో నిలిచారు.

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం

మొత్తం ఓటర్లు	: 2,72,826
పురుష ఓటర్లు	: 1,33,241
మహిళా ఓటర్లు	: 1,39,561
ఇతరులు	: 24
పోలింగ్ స్టేషన్లు	: 267
సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు	: 56
పోటీలో ఉన్న అభ్యర్థులు	: 07

పోలింగ్ సమయం: ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు

సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశాం. ఈవీఎంలు తదితర ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించాం. ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– ఎస్.తేజ్‌భరత్, ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్

ప్రజాస్వామ్య పండగకు సర్వం సిద్ధం

- ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయండి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత



ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఆర్వో, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేలా ప్రజాస్వామ్య పండగకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని నేక్ హాస్టల్ భవనం వద్ద రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఏడు నియోజక వర్గాల పరిధిలో 1,577 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం జిల్లాలో 16 లక్షల 23 వేల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పో లింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ముందుగా ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఉదయం .5.30కు సిబ్బంది అంతా పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరై, పీడీఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలు మొరాయిస్తే, వాటి స్థానే మరొకటి ఏర్పాటు చేసేలా అదనంగా రెండు యూనిట్లు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్య వచ్చిన 15 నిమిషాల్లో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిష్కరించేలా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో బెల్ ఇంజినీర్లు 21 మంది రాగా, ముగ్గురు చొప్పున నియోజకవర్గాలకు కేటాయించినట్టు తెలిపారు. స్టేట్ అబ్జర్వర్ బాలసుబ్రహ్మణ్యం రూరల్ నియోజకవర్గ ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రూరల్ నియోజకవర్గ ఈఆర్వో ఎస్.తేజ్‌భరత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, సహాయ ఎన్నికల అధికారులు ఉన్నారు.

ఓటు వేయకపోతే బాధ్యతారాహిత్యమే..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పోలింగ్ రోజు కచ్చితంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పలువురు వృద్ధులు, వికలాంగులు అంటున్నారు. ఓటు వేయకుండా, సెలవు రోజు ఎంజాయ్ చేద్దామని యువత ఇంట్లో కూర్చుంటే అంతకంటే పెద్ద ప్రమాదం మరొకటి ఉండదని చెబుతున్నారు. ఓటు హక్కు విలువను ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరుతున్నారు. మేము సైతం ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో ఓటు వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, యువతరం కూడా ఓటు వేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తున్నారు.

సామాజిక బాధ్యత



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్క ఓటరు కచ్చితంగా వినియోగించుకోవాలి. అది మన సామాజిక బాధ్యత. మే 13న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఓటు హక్కును వినియోగించుకుంటాం. మరింత మందికి స్ఫూర్తి కల్పిస్తాం.

– నారాయణ వీరరాఘవయ్య, దివ్యాంగ ఓటరు

రాజ్యాంగం కల్పించిన ఆయుధం



ప్రతి ఒక్క ఓటరు రాజ్యాంగం ఆయుధంగా కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలి. యువత ఓటు హక్కు విలువను తెలుసుకోవాలి. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఓటు వేయడం మానలేదు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఓటు వేసి యువతకు ఆదర్శంగా నిలుస్తాం.

– వందింటి లక్ష్మీనారాయణ, సీనియర్ సిటిజన్

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

నల్లజర్ల: స్థానిక ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుణ్ణంపల్లి సిద్ధూ అనే మూడేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి పిన తండ్రి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన గొన్నూరి రాజు, మరియమ్మల కుమారుడైన సిద్ధూ ఆదివారం దూబచర్లలో బంధువుల ఇంట జరిగిన శుభ కార్యానికి కుటుంబ సభ్యులు అందరితో కలసి వచ్చాడు. సిద్ధూ చిన్నాన్న సూర్యచంద్రరావు తన బైక్‌పై సిద్ధూను ఎక్కించుకొని నల్లజర్ల బస్టాండ్‌లో ఉన్న తమ బంధువులను కలుసుకునేందుకు బయలు దేరాడు. నల్లజర్ల ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వారి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. కిందపడిన సిద్ధూపై నుంచి బస్సు వెళ్లడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సూర్యచంద్రరావును తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నల్లజర్ల ఎస్ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.